# పునర్దర్శనం



ఆచంట జానకిరామ్

రాధ నిద్రాహారాలు మానేసింది.

ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూన్నట్టుంటుంది, ఆమె ముఖము. విపరీతపు పరధ్యానం.

ఆమె భర్త సునందుని సంరక్షణములో ఏమాత్రమూ లోపము రానీయదు రాధ. ప్రతి చిన్న విషయమూ ఎంతో శ్రద్ధగా చూస్తుంది. కాని, తన్నుగురించి మాత్రం, ఏమీ పాటించదు. పువ్వులంటే విపరీతపు ప్రీతి. ఏరంగు చీరకు తగినట్లు ఆరంగు పువ్వులను చెండుగా కూర్చి తలలో పెట్టుకునే ఆ అందాలరాశి, ఏదో వాలాయం కోసం, కొప్పులో ఒక్క పువ్వే చెక్కుకొని, చేతికి అందిన ఏదో నగను పెట్టుకొని, ఇంటి పనులలో లీనమైపోతుంది. తన్ను విడవకుండా వెంటాడే పెంపుడు లేడిని పలుకరించడమే మానివేసింది. లేడిపిల్ల ఆమెకేసి జాలిగా చూస్తూ, ఆమె అందించిన గరిక పోచలు గుళ్ళను కొరకడము లేదని కూడా గ్రహించదు రాధ!

ఎన్నో ప్రయత్నాలు చేశాడు సునందుడు. రాధ బెంగకు కారణమును తెలుసుకోవాలని. ఎన్నిసార్లో ప్రశ్నించాడు. "ఎందుకల్లా ఉన్నావురాధా?" అంటూ. అన్నిసార్లూ ఒక్కటే జవాబు! "ఎల్లా ఉన్నాను?" అని. అంతే!

ఒకసారి, సునందుడు రాధ రెండుచేతులనూ గట్టిగా పట్టుకుని, "ఎందుకల్లా ఉన్నావు?...చెపితేగాని విడిచిపెట్టను!" అన్నాడు, పట్టుదలతో. రాధ తన చేతులు విడిపించుకోవాలని ప్రయత్నించలేదు కాని, భర్తకేసి జాలిగా చూచింది; సూటిగా అతని కళ్ళల్లోకి. అలా చూస్తుండగానే, ఆమె కళ్ళల్లోంచి కన్నీటి ముత్యాలు జలజలా రాలాయి. చటుక్కున, అతని భుజాన తలవాల్చి, వెక్కి వెక్కి ఏడ్వసాగింది, రాధ.

సునందుని మనసులో మెరుపు మెరిసింది, ఒక ఆలోచన. ఉన్నట్టుండి, అతనికి అర్థమైంది.

రాధ వీపును అతి మృదువుగా నిమురుతూ ఆమెను, మెల్లిగా, పర్యంకము పైకి జేర్చి, తలదిండు అమర్చి, "కాస్సేపు విశ్రమించు, రాధా! నేను పొలంలో పనిచూచుకు వస్తాను," అంటూ, ఇవతలకు వచ్చాడు, సునందుడు.

పొలం వెళ్ళిన సునందుడు ఇంటికిరాలేదు. అక్కడనుంచే కబురు చేశాడు, తాను ఊరు వెళుతూన్నట్టు.

● ● ●

ఆరోజు గురువారం.

వంతుప్రకారము, శ్రీకృష్ణుడు జాంబవతీదేవి అంతఃపురాన ఉన్నాడు, ఇవ్వాళ.

శ్రీకృష్ణునికి తోటపని అంటే చాలా ఇష్టము. అదీ, అందమైన తీగమొక్కలకు బోదులుచేసి, తగిన ఆసరా యిచ్చి, తీగలను పైకి ప్రాకించడము అతనికి ప్రియమైన వ్యాపకము. ఈ ఉదయము మాధవీలతను మామిడిపైకి ప్రాకిస్తున్నాడు.

ప్రాతిగామి వచ్చి, చెప్పాడు: "దేవర దర్శనార్థము సునందుడట, వ్రేపల్లెనుంచి వచ్చారు. అరుగో! ఇటు వస్తున్నారు!" అని.

వ్రేపల్లెనుంచి ఎవరు వచ్చినా వెంటనే ప్రవేశపెట్టమని శ్రీకృష్ణుని ఆజ్ఞ.

మట్టిచేతులలోనే, శ్రీకృష్ణుడు ఎదురు వెళ్ళి, సునందుని గట్టిగా కౌగిలించుకున్నాడు...

....పొగడచెట్టు నీడను చలువరాతి తిన్నెపైన కూర్చొని, స్నేహితులిద్దరూ కబుర్లు చెప్పుకుంటున్నారు.

శ్రీకృష్ణుడు ప్రశ్నించాడు: "వ్రేపల్లెలో అందరూ క్షేమమేనా?" అని.

సునందుడు : "ఆ ! అందరూ క్షేమమే... కాని, నంద, యశోదలకు తెలియదు. నేఁ నీవద్దకు వస్తున్నానని."

శ్రీకృష్ణుడు : "అల్లాగా ! ఉన్నపళం బయలుదేరావన్నమాట. రాధ...."

శ్రీకృష్ణుని మాటకు అడ్డమువచ్చి, సున దుడు ప్రాధేయపడ్డాడు !

"కృష్ణయ్యా! ఒక్కసారిరావా, వ్రేపల్లెకు వెంటనే, నాతో ...వస్తావా కృష్ణయ్యా !.. వస్తావా ?" అని.

శ్రీకృష్ణుని కన్నుల ఎదుట రాధ ప్రత్య మైంది. బెంగతో చిక్కి సగమైన రాధ; వ లైన వంకీలూ, దండ కడియాలూ ముంజే మీదికి వచ్చాయి. అసలే, పోకమొక్కలాగ సన్నని శరీరము. ఇప్పుడు, మరీ సన్నంగా కన్పించింది. ముఖము తనవైపే ఉన్నది. కాని, కన్నులు గట్టిగా మూసుకుని ఉన్నట్లుంది. ఇరు కనుకొలకుల నుంచీ కన్నీటిధార ఏక ధారగా ప్రవహిస్తోంది. వాడిన పెదవులు అదరుతున్నాయి : 'కృష్ణా !' కృష్ణా ! !' అనే ఆక్రందనము వినిపించింది, ద్వారకా నిలయానికి.

"అల్లాగే వెళ్ళదాము, సునందా : ఈ పూటే వెళ్ళదాము !" అన్నాడు, శ్రీకృష్ణుడు, చిరునవ్వు నవ్వుతూ.

తలిరుటాకుల మధ్యనుంచి త్రోవచేసుకు వచ్చిన ఒక కిరణజాలము శ్రీకృష్ణుని ఫాల భాగాన మెరిసింది.

సునందుడు సంతోషముతో ఏదో అన బోయాడు. ఇంతట్లోకి, వారిద్దరికీ పాలూ పండ్లూ తెచ్చిన జాంబవతీదేవి అతనిని సాద రముగా పలుకరించింది.

జాంబవతి భుజాన చేయి ఉంచి, శ్రీకృష్ణు డన్నాడు : "సునందునితో నేను ఒక పర్యాయం వ్రేపల్లెకు వెళ్ళివస్తాను. వెంటనే తిరిగి వస్తాను !" అని.

జాంబవతి అర్థము చేసుకుంది.

ఒక్క క్షణము ఆగి, శ్రీకృష్ణుడు మళ్ళా అన్నాడు, ఆమెతో : "నేను ఊళ్ళో లేనట్టు ఎవరికీ తెలియనక్కరలేదు" అని.

జాంబవతి అర్థము చేసుకుంది.




....బయలుదేర బో తు న్న సునందుని చేతిలో చీనిచీనాంబరాలుంచింది జాంబవతి. రాధాదేవికి తన కానుకగా.

● ● ●

గున్న మావి పీడను కపిల గోవును పాలు పితుకుతోంది రాధ. బంగారపు పువ్వు తాపిన వెండి ముక్కాలి పీటమీద కూర్చొని.

దూడను మూజూచి, సంతృప్తితో నిండిన కళ్ళతో, ఇటు తిరుగుతూ, మెడపైకెత్తి రాధాదేవికేసి చూస్తోంది, గంగగోవు.

పాలచెంబు నిండుతోంది. పట్టు దారముల వంటిసన్నని ధారలతో. చెవుల కింపైన ఆ ధ్వని రాధకు ఒకరీతి మైకమును కలిగిస్తోంది.

ఇంతల్లోకే వీధి వాకిలి తలుపు తెరచుకొని, శ్రీకృష్ణుడు ఆవరణలో అడుగు పెట్టాడు.

ఆ అడుగుల చప్పుడు గుర్తించి ఆవు 'అంబా !' అని అరచింది. సంభ్రమముతో.

ఆ అరుపుకు బెదిరి రాధ ఇటు తిరిగింది.

తనను వేవేగ సమీపిస్తున్న శ్రీకృష్ణ స్వరూపాన్ని చూచి, రాధ చటుక్కున లేచి నిలుచుంది.

ఆమె చేతిలోని పాలచెంబు పడబోయిందే. శ్రీకృష్ణుడు, ఒక్క అడుగులో, అందుకు వచ్చి, అందుకోక పోతే: సునందుడు రాధను గట్టిగా పట్టుకున్నాడు.

ధారలు ధారలుగా కారుతున్న గంగగోవు పాలు భూమిని పావనము చేస్తున్నాయి.

రాధ లేచివెళ్ళిన ముక్కాలి పీటపైన తాను కూర్చుని, చెంబునిండా పాలు పితికాడు, శ్రీకృష్ణుడు.

పై కుబికిన నురగను తనవెచ్చని ఊర్పుతో ఊదుతూ, నిండు చెంబును రాధ చేతి కందించాడు, శ్రీకృష్ణుడు, "పాలచెంబును లోపల పెట్టి వస్తావా రాధా: అంటూ.

● ● ●

పూచిన పోక మొక్కలమధ్య ప్రవహిస్తూంది, సన్నని సెలయేరు.

ఆ నీటిలో పా దా ల ను తడుపుకుంటూ అర్ధ నిమీలిత నేత్రుడై ఏదో వింత అనుభూతిని పొందుతున్నాడు, శ్రీకృష్ణుడు.

అతని కుడివైపున సునందుడు నిలచి ఉన్నాడు.

కట్టెదుట రా ధ నిలచి ఉన్నది, పోక మొక్క నానుకొని.

ఎంత కళగా ఉన్నది, ఆమె ముఖము :

ఎంత చప్పున సింగారించుకొని వచ్చింది, ఆమె, శ్రీకృష్ణుని మ్రోలకు.

....వారు ముగ్గురూ ఏవేవో విషయాలు మాట్లాడుకున్నారు. ఎన్నెన్నో పాత స్మృతులను నెమరు వేసుకున్నారు.

చివరకు అన్నది రాధ, భూమిలోకిచూస్తూ:

"ఈ పూటే వెళ్ళిపోవాలా ?........రేపు వెళ్ళకూడదా ?" అని.

ఇంకా ఏమో అనాలనుకున్నది; కాని, కంఠస్వరము గద్గదికమైంది. బొట బొట కన్నీరు ప్రవహింపసాగింది. ఇక మాట్లాడ లేక పోయింది, రాధ.

లేచి నిలచుని, ఆమె చుబుకమును తనవైపు త్రిప్పుకుంటూ, తన చీనాంబరపు కొసలతో ఆమె కన్నీటిని తుడిచాడు, శ్రీకృష్ణుడు.

శ్రీకృష్ణ కరస్పర్శకు గడగడ వణకిపోతోంది, రాధ. ఎన్ని యుగాలకు పూర్వమో అనుభవించినట్లు తోచింది, ఈ ఆనందము....

........తను ఏమై పోతోంది ! తనకు తెలియని ఏదో వింత శక్తి ఆమెను ఎక్కడకో, ఎక్కడకో తీసుకు పోతోంది – ఎక్కడకో, ఎక్కడకో.... .......అక్కడ భూమిలేదు; ఆకాశంలేదు. వెలుతురులేదు; చీకటిలేదు. కాని, ఏదో అద్భుతమైన పరిమళము తన చుట్టూ ఆవరించింది. ఏదో పరమాద్భుతమైన దివ్య సంగీతములో తాను లీనమై పోతోంది.... ఎంతోదూరాన్నుంచిలా, తీయ తీయనిమాటలు వినిపించాయి ఆమెకు – ముందు అస్పష్టంగా. క్రమేపీ దగ్గరగా. ఎంతో దగ్గరగా :

"చూడు, రాధా ! చూడు !!....రాధా : ఇటుచూడు : : ...నీవు బాధపడకూడదు. నేనెప్పుడూ నీతోనే ఉంటానుగా : నేను, అసలు నిన్నువిడిచి వెళ్ళనేలేదుగా :: .... చూడు :: ఇటుచూడు :: "—అంటూ లాలిస్తూ వినిపించే ఆ మాటలకు కళ్ళుతెరచి చూచింది రాధ.




ఎదుట తన భర్త ఉన్నచోట శ్రీకృష్ణ విగ్రహము.

శ్రీకృష్ణుడు ఉండవలసినచోట తన స్వరూపము – మూడు మూర్తులా తన స్వరూపము.

అప్రయత్నంగా రాధ తన్ను తాను చూసుకుంది. తాను, తానుకాదు, తాను, తన భర్త స్వరూపమును దాల్చింది.

మళ్ళా, ఆ తేనెవాన కురిసింది :

"రాధా ! మనము వేరువేరు కాదు. నీవు నేనే; సునందుడే నీవు; నేను రాధను. ఇక మనకు వియోగమెక్కడిది:" అని.

.... మూర్ఛిల్లిన రాధ తేరుకునేసరికి, పెంపుడు లేడి ఆమె పాదాలపైన తలపెట్టుకు పడుకొని ఉంది. పొగడ పువ్వులన్నీ ఒకసారి ఆమెపైకి పూలజల్లుగా కురుస్తున్నాయి.

'అక్కా ! అక్కా !!' అంటూ పిలుస్తోంది, పంచవన్నెల చిలుక, పూచిన అశోక వృక్షపు కొమ్మల మాటునుండి.

సెలయేటిపైనుండి ఎగసిన చల్లని పిల్ల వాయువు రాధను తన కౌగిటిలోకి తీసుకుంది.

శ్రీకృష్ణ కరస్పర్శను మళ్ళా అనుభవిస్తూ తన్మయతతో కళ్ళు మూసుకుంది రాధ....

□□□